పీహెచ్‌సీ సేవలు.. ఎంతెంతదూరం..

- క్లిష్టమైన కాన్పులకు సత్తెనపల్లి పరుగు..
- ఆపరేషన్లకు వసతులు లేవు
- మహిళలకు వైద్యసేవలు కరువు



పాత పీహెచ్‌సీ భవనం(ఫైల్)



వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన అచ్చంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం

అచ్చంపేట: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలపై నిర్లక్ష్యంతో సేవలు దూరమవుతున్నాయి. క్లిష్టమైన కేసులను సమీపంలో సత్తెనపల్లి పరుగుపెట్టాల్సి వస్తోంది. కాన్పులకు వచ్చే వారిని అత్యవసరతే 108లో తరలిస్తున్నారు. ట్యూబెక్టమి, వ్యాసక్టమి, హిస్టెరెక్టమీ, లాప్రోస్కోపిక్, ఆపరేషన్లు చేసేందుకు ఒక గైనకాలజిస్టు కూడా లేరు. రోడ్డు ప్రమాదాలతో తీవ్ర గాయాలై అత్యవసర వైద్యసేవలకోసం పీహెచ్‌సీకి వస్తే కుట్లు వేసి ప్రథమ చికిత్స చేసే నాథుడే కరువయ్యారు.

70 వేలు జనాభాకు సేవలు..

మండలంలో 23 గ్రామ పంచాయతీలు, 28 గ్రామాలు, 70 వేల జనాభా ఉన్నారు. మండలం కేంద్రం నుంచి 20 కిలోమీటర్లు గ్రామాలు విస్తరించి ఉన్నాయి. వైద్యసేవల కోసం వేలాది మంది ఇక్కడకు వస్తుంటారు. పేదలకు ఆసరాగా పీహెచ్‌సీ ఉండేంది. గత వైఎస్సార్ సీపీ హయాంలో వైద్యశాలను ఆధునికీకరించారు.

వైద్యశాల భవనం..

ఇవన్నీ చూస్తుంటే మళ్లీ 2019కి ముందు రోజులు గుర్తుకొస్తున్నాయి. విద్యకు, వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్ కనీస వసతులులేక కునారిల్లిపోతున్న పాత ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం స్థానంలో నాడు– నేడు నిధులు రూ.2 కోట్లతో నూతన భవనాన్ని నిర్మించారు.

గతంలో అందుబాటులో డాక్టర్లు..

ఒక్క వైద్యాధికారి కూడా సక్రమంగా లేని పరిస్థితులకు స్వస్తి చెప్పి వైఎస్సార్ సీపీ హయాంలో నలుగురు వైద్యులను నియమించారు. కార్పొరేటు వైద్యశాలకు దీటుగా అధునాతన పరికరాలతో 67 రకాల రక్తపరీక్షలను అందుబాటులోకి తెచ్చారు. దూదికి కూడా కరువైన రోజుల నుంచి అన్నిరకాల మందులను ఫార్మసీలో అందుబాటులో ఉండే విధంగా ఆధునికీకరించారు. ఖాళీగా ఉన్న పోస్టులను మొత్తం భర్తీ చేశారు.

ఇప్పుడా పరిస్థితులులేవు...

పీహెచ్‌సీలో నలుగురు వైద్యులకు గాను ఒకరిని డెప్యుటేషన్‌పై పంపారు. మరొకరు 104 లో రోజు ఏదో ఒక గ్రామానికి వెళ్తున్నారు. మిగిలిన ఇద్దరిలో ఎక్కువభాగం మేల్ డాక్టర్లే పీహెచ్‌సీలో ఉంటున్నారు. దీనివల్ల సాధారణ వ్యాధులు అంటే జ్వరాలు, జలుబులు, దగ్గులు వంటి వ్యాధులకు తప్ప పీహెచ్‌సీలో వైద్యసేవలు అందుబాటులో లేవనే చెప్పాలి. ముఖ్యంగా స్త్రీలకు కావలసిన వైద్య సేవలు అసలు అందుబాటులో లేవు.

ఆపరేషన్లు లేనట్లే..

గతంలో వైద్యసిబ్బందికి టార్గెట్స్ పెట్టి నెలలో కనీసం 30కి పైగా ట్యూబెక్టమీ ఆపరేషన్లు పీహెచ్‌సీలోనే చేసేవారు. పురుషులకు వ్యాసక్టమీ ఆపరేషన్లు చేసేవారు. హిస్టెరెక్టమీ ఆపరేషన్లు కూడా ఇక్కడే జరిగేవి. ప్రసవం అనంతరర అధిక రక్తస్రావం అయితే ఇక్కడే డీ అండ్ సీ చేసేవారు. ఇప్పుడా పరిస్థితులు లేవు. గత వైద్యసిబ్బందికి టార్గెట్స్ పెట్టి ట్యూబెక్టమీ ఆపరేషన్లు చేసేవారు. ఇప్పుడా టార్గెట్స్ లేవు. రెండువ కాన్పుకు వచ్చేవారు ఎక్కువగా ప్రసవం తరువాత ట్యూబెక్టమీ చేయించుకుంటారు. అలా వచ్చేవారిని కూడా సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు రిఫర్ చేస్తున్నారు. మొదటి కాన్పు ఆపరేషన్ జరిగితే రెండవ కాన్పు కూడా ఆపరేషన్ చేయాల్సి వస్తుందని అంచనాలు వేసి సత్తెనపల్లికి పంపుతున్నారు. ఆరోగ్య పరిస్థితులను బట్టి ఫ్రీ డెలివరీనా, సర్జరీనా అనే అంచనాలు వేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

ఆపరేషన్లు అవసరమైన వారిని..

సాధారణ కాన్పులు మాత్రమే ఇక్కడ చేస్తున్నాం. ఆపరేషన్స్ అవసరమైన వారిని సత్తెనపల్లికి 108లో పంపుతాం. ఆపరేషన్లు చేసేందుకు థియేటర్ ఉంది. అందులో తగిన సదుపాయాలు లేవు. అందువలనే చేయలేకపోతున్నాం. కుటుంబ నియంత్రణ ఆపరేషన్స్‌కు ఇప్పుడు టార్గెట్స్ లేవు. కావాలనుకున్నవారిని సతైనపల్లి పంపి చేయిస్తున్నాం. ప్రమాదాలతో వచ్చే వారికి ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యసేవల కోసం సత్తెనపల్లి తరలిస్తున్నాం.



– డాక్టర్ ఇన్నారావు, వైద్యాధికారి, అచ్చంపేట పీహెచ్‌సీ

క్లుప్తంగా

గ్రామస్థాయిలో బీజేపీని బలోపేతం చేయాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశికుమార్



అమరావతి: పల్నాడు జిల్లాలోని అన్ని నియోజవర్గాలలో గ్రామ స్థాయిలో బీజేపీని బలోపేతం చేయాలని పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు ఏలూరి శశికుమార్ అన్నారు. స్థానిక ఎ.వి.ఆర్. కళ్యాణమండపంలో జిల్లా ప్రతినిధుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. జిల్లా మాజీ అధ్యక్షుడు ఆలోకం సుధాకరబాబు అధ్యక్షత వహించారు. శశికుమార్ మాట్లాడుతూ దేశాన్ని ప్రధాని మోదీ జనరంజకంగా పాలించి అన్ని రంగాలలో అభివృద్ధి సాధించారన్నారు. సమావేశంలో రాష్ట్ర ఎంపీపీల సంఘం అధ్యక్షుడు మేకల హనుమంతరావు, జిల్లా ఇన్‌చార్జి కొక్కెర శ్రీనివాస్, నాయకులు ఎం.ధాత్రి నారాయణ, పుల్లారావు పాల్గొన్నారు.

మొక్కుబడిగా మండల సర్వసభ్య సమావేశం



ముప్పాళ్ల: మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా ముగిసింది. ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో ఎటువంటి తీర్మానాలు లేకుండానే సమావేశాన్ని ముగించినట్లు ఎంపీడీఓ పీజే విలియమ్స్ చెప్పారు. రానున్న వేసవి దృష్ట్యా తాగునీటి సమస్యపై ఎటువంటి చర్యలు తీసుకుంటారో సమావేశంలో ప్రస్తావించలేదు. ఎన్ఆర్ఈజీఎస్ పథకం అమలుపైన ఎటువంటి చర్చ జరగలేదు. సమావేశం నిర్వహించేందుకు అవసరమైన గౌరవసభ్యులను పిలిపించి వారిచే సంతకాలు చేయించుకొని సమావేశాన్ని ముగిస్తున్నట్లుగా ప్రకటించి వెళ్లిపోయారు. ఎంపీడీవో పీ.జే.విలియమ్స్, ఆరుగురు ఎంపీటీసీ సభ్యులు, నాలుగు గ్రామాల సర్పంచులు, నాలుగు శాఖలకు సంబంధించిన అధికారులు హాజరయ్యారు.

15 మందికి జాతీయ ఉపకార వేతనాలు

నాదెండ్ల: గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న 15 మంది విద్యార్థులు జాతీయ ఉపకార వేతనాలకు అర్హత సాధించారు. గతేడాది డిసెంబర్ 8న నరసరావుపేటలో వ్రాత పరీక్ష నిర్వహించారు. ఈ పాఠశాల నుంచి 44 మంది పరీక్షకు హాజరుకాగా, హెచ్ ఆదిత్య, సీహెచ్ దినేష్, పూర్ణిమ, హరీష్, తుల సీచైతన్య, ఎస్తేరురాణి, మార్త పావని, అద్దంకి హేమశ్రీ, ఎ.ప్రత్యూష, సీహెచ్ ఆకాంక్ష, కె.అనూహ్య, బి రమ్యశ్రీ, ఎ శ్రావ్య, జి.దేవకి, యు. జశ్వంత్‌కుమార్ ఉపకార వేతనాలకు ఎంపికయ్యారు. వీరికి ప్రభుత్వం 9,10 తరగతులు, ఇంటర్ రెండు సంవత్సరాలు ప్రతి ఏడాది రూ.12 వేలు నగదును వారి బ్యాంకు ఖాతాలకు జమ చేయనున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

చైన్ స్నాచర్ అరెస్ట్

నరసరావుపేటటౌన్: వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు లాక్కొని పారిపోయిన కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు టూటౌన్ సీఐ హైమారావు శుక్రవారం తెలిపారు. రజకవాడ ప్రాంతానికి చెందిన కొత్తమాసు పుష్పావతి గత నెల 31వ తేదీ ఇంటి బయట కూర్చొని ఉండగా ద్విచక్ర వాహనంపై వచ్చిన యువకుడు ఆమె మెడలో బంగారు గొలుసు లాక్కొని పరారీ అయ్యాడు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

జొన్నలగడ్డలో ఆర్‌యూబీని ఏర్పాటు చేయాలి



నరసరావుపేట రూరల్: జొన్నలగడ్డ సమీపంలోని రైల్వే లైన్ వద్ద రెండవ ఆర్‌యూబీని ఏర్పాటుచేయాలని రైతులు రైల్వే అధికారులను కోరారు. మలుపుతో, తక్కువ ఎత్తుతో ఏర్పాటు చేసిన మొదటి ఆర్‌యూబీ వలన రైతులు పడుతున్న ఇబ్బందులను జిల్లా కలెక్టర్ గ్రామస్తులు గ్రీవెన్స్‌లో కోరారు. దీనిపై స్పందించిన రైల్వే అధికారులు శుక్రవారం గ్రామంలో పర్యటించారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను రైతులు రైల్వే అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఆర్‌యూబీలో మలుపు వలన ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదని, తక్కువ ఎత్తుతో ఉండటం వలన ట్రాక్టర్లతో పొలాల నుంచి వరి గడ్డిని తీసుకురావడం కష్టంగా మారుతుందని తెలిపారు. రెండవ ఆర్‌యూబీని తొమ్మిది అడుగుల ఎత్తు, తొమ్మిది అడుగుల వెడల్పుతో ఏర్పాటుచేయాలని కోరారు. దీనిపై స్పందించిన రైల్వే అధికారులు సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

దామోదరం సంజీవయ్య సేవలు మరువలేనివి

- వైఎస్సార్ సీపీ సమన్వయకర్త డాక్టర్ సుధీర్ భార్గవ్ రెడ్డి
- సత్తెనపల్లిలో ఘనంగా దామోదరం సంజీవయ్య జయంతి



పార్టీ కార్యాలయంలో దామోదరం సంజీవయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ సుధీర్‌భార్గవ్‌రెడ్డి

సత్తెనపల్లి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా సేవలందించిన దామోదరం సంజీవయ్య సేవలు ఎన్నటికీ మరువలేనివని వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వ యకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని నియోజకవర్గ కార్యాలయంలో దివంగత దామోదరం సంజీవయ్య జయంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధీర్ భార్గవ్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రానికి తొలి దళిత ముఖ్యమంత్రిగా పనిచేసిన సంజీవయ్య ఎందరికో స్ఫూర్తిని ఇచ్చారన్నారు. దళితులతో పాటు వెనుకబడిన వర్గాలకు ఆయన అందించిన సేవలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. ఆయన జీవిత మంతా పోరాటమని, వాటిని ఎంతో ధైర్యంగా ఎదుర్కొన్నారని కొనియాడారు. పేదల అభ్యున్నతికి ఆయన చేసిన సంస్కరణలు ఎంతగానో ఉపయోగపడ్డాయని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు చల్లంచర్ల సాంబశివరావు, పెండెం బాబూరావు, చిలుకా జైపాల్, రమావత్ కోటేశ్వరావు నాయక్, షేక్ మౌలాలి, లోక మాధవ, బండి మల్లికార్జునరెడ్డి, తుమ్మల వెంకటేశ్వరరావు, షేక్ జలీల్, జూపల్లి పాల్, సంకుల తిరుమలరావు ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ....

పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి దివంగత దామోదరం సంజీవయ్య జయంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు దాసరి జ్ఞానరాజ్ పాల్ మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా సంజీవయ్య అనేక విప్లవాత్మక విధాన నిర్ణయాలు తీసుకున్నారన్నారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి మాదం శెట్టి వేదాద్రి, కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ చాన్‌బాషా, కొత్త లక్ష్మయ్య, కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ నాయకులు సిదెవు దళిత నాయకులు జిల్లెల్ల పాల్ రాజు, ముప్పాళ్ళ మండలం కాంగ్రెస్ నాయకులు కోట ఆనంద్, పి.వెంకటేశ్వర్లు, కోటపాటి సాంబ శివరావు, పోతల సంగీతరావు, రత్తయ్య పాల్గొన్నారు.

బాల్య సంరక్షణ విద్యపై ప్రోత్సహించాలి

- సత్తెనపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ శ్రీలత
- అంగన్‌వాడీ కార్యకర్తలకు 'పోషణ్‌భీ పడాయిభీ'పై శిక్షణ



పట్టణంలో మాట్లాడుతున్న సీడీపీఓ శ్రీలత

సత్తెనపల్లి: ప్రారంభ బాల్య సంరక్షణ విద్యపై విద్యార్థులను ప్రోత్సహించాలని ఐసీడీఎస్ సత్తెనపల్లి సీడీపీఓ టి.శ్రీలత అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు 'పోషణ్‌భీ పడాయిభీ' పై నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల్లో శుక్రవారం ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చిన్నారుల ఆలోచన శక్తిని పెంచేందుకు, వారి శారీరక, మానసిక ఉత్తేజానికి అంగన్‌వాడీ కార్యకర్తలు బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. శిక్షణలో పోషణ ట్రాకర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ దీప, ఏసీడీపీఓ సంతోష కుమారి, సూపర్‌వైజర్ పి.ప్రమీల మాట్లాడారు. శిక్షణలో వెన్నాదేవి, రెంటపాళ్ల, కొండమోడు సెక్టార్లకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు హాజర య్యారు.

సామర్థ్యాల పెంపుకు శిక్షణ దోహదం ...

అంగన్‌వాడీ కార్యకర్తల సామర్థ్యాన్ని పెంపొందించేందుకు 'పోషణ్‌భీ పడాయిభీ' శిక్షణ తరగతులు దోహదపడతాయని పోషణ ట్రాకర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ దీప అన్నారు. పోర్షణ్‌భీ పడాయిభీ మూడు రోజుల శిక్షణా తరగతులలో భాగంగా సత్తెనపల్లి మండలం కొమెరపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కంటిపూడి, రెంటపాళ్ల సెక్టార్ల నుంచి హాజరైన అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇస్తున్న శిక్షణలో శుక్రవారం ఆమె పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ కార్యకర్తలు అందరూ ఈ శిక్షణను సద్వినియోగం చేసుకొని మరింత మెరుగైన సేవలు అందించాలన్నారు. శిక్షణలో సూపర్వైజర్లు ఓ అనంతలక్ష్మి, షేక్ ఆషా మాట్లాడారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

క్రోసూరు: గర్భిణులు, బాలింతలు, పిల్లలకు తప్పని సరిగా పోషకాహారాలు తీసుకొనేలా అంగన్‌వాడీ వర్కర్లు అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ క్రోసూరు సెక్టార్ సూపర్‌వైజర్ వి.మాధవి తెలిపారు. క్రోసూరు జెడ్పీపాఠశాలలో రాష్ట్ర ఉమెన్‌అండ్ చైల్డ్ వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్లకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు రెండవ రోజు శుక్రవారం కార్యక్రమలో సూపర్‌వైజర్ పాల్గొని శిక్షణనిచ్చారు.

పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకోవాలి

ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



పెన్షనర్స్ హోమ్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి: ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా పట్టభద్రులు అందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని సత్తెనపల్లి శాసన సభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఏపీ ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ హోమ్‌లో పెన్షనర్స్‌తో, కాకతీయ కళ్యాణ మండపంలో న్యాయవాదుల తో శుక్రవారం వేర్వేరుగా సమావేశం నిర్వహించారు. పెన్షనర్స్ హోమ్‌లో జరిగిన సమావేశానికి ఏపీ ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జక్కుల లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పట్టభద్రులు, మేధావులు అందరూ మొదటి ప్రాధాన్య ఓటును కూటమి బలపరిచిన ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ యెల్లినేడి రామస్వామి, డీఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు దరువూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మిరపలో అంతర పంటలతో లాభాలు



మిరప లో అంతర పంటలను పరిశీలిస్తున్న జిల్లా ప్రాజెక్టు మేనేజర్ .అమలకుమారి

రాజుపాలెం: ప్రకృతి వ్యవసాయ విధానంలో మిరప పంటలో పలు అంతర పంటలు వేయడం వలన రైతులకు ఖర్చు తగ్గి అధిక ఆదాయాలు పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ పల్నాడు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.అమలకుమారి రైతులకు సూచించారు. మండలంలోని రెడ్డిగూడెంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండిస్తున్న మిరప పంటను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మిరప పంట పొలాలలో అంతర పంటలుగా ఉల్లి, క్యారెట్, బీట్ రూట్, ముల్లంగి, కొత్తిమీర, బంతి, ఆముదం వంటి పంటలు వేయడంద్వారా మిరప పంటకు వచ్చే తామర పురుగును నివారించవచ్చని వివరించారు. ఎస్‌కే కరిముల్లా ప్రకృతి వ్యవసాయంలో మిరప పంటకు రూ.50వేలు పెట్టుబడి పెట్టగా రూ.1.50 లక్షలు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. అదేవిధంగా ప్రతి ఒక్క రైతు రసాయనాలు వీడి ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలను సాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీపీపీ భవానీరాజ్ పాల్గొన్నారు.

లక్కరాజుగార్లపాడులో వృద్ధురాలి ఇంట్లో చోరీ



గాయపడిన వృద్ధురాలు నారాయణమ్మ

సత్తెనపల్లి: వృద్ధురాలు ఇంట్లో చోరీకి పాల్పడి అడ్డొచ్చిన వృద్ధురాలిపై దాడి చేసిన ఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం లక్కరాజుగార్లపాడు గురువారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామంలోని గ్రామీణ పశువైద్యశాల, రైస్‌మిల్ సమీపంలో వృద్ధురాలైన సోడాల నారాయణమ్మ ఓ గృహంలో ఉంటూ జీవనం వెళ్లదీస్తోంది. వృద్ధురాలు ఇంట్లో లేని సమయాన్ని గమనించిన ఇద్దరు దుండగులు ఒకరు బయట రెక్కీ నిర్వహిస్తుండగా మరొకరు చోరీ చేసేందుకు లోపలికి వెళ్లి బీరువా పగలగొట్టి రూ.లక్ష నగదు అపహరించాడు. వృద్ధురాలు ఇంట్లోకి రావడంతో పసిగట్టిన దుండగుడు ఆమెను బలంగా గోడకి మోదాడు. నుదుటిపైన, ఛాతి పైన బలమైన గాయాల య్యాయి. ఆమె కేకలు వేయడంతో పరుగులు తీశారు. ఘటనపై సత్తెనపల్లి రూరల్ పోలీసులకు సమాచారం అందడంతో పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎరువులు దుకాణం, హోండా షోరూంలో చోరీ

- రూ.3.13 లక్షలు నగదు అపహరణ
- రెండు దుకాణాల్లో సీసీ ఫుటేజ్ ధ్వంసం
- దుకాణాలను పరిశీలించి కేసు నమోదు చేసిన పోలీసులు



ధ్వంసమైన సీసీ ఫుటేజ్

సత్తెనపల్లి: రెండు దుకాణాల్లో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడిన ఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో శుక్రవారం వెలుగు చూసింది. వివరాలు.. పట్టణంలోని మాచర్ల రోడ్డులో చెక్‌పోస్ట్ సమీపంలో ప్రధాన రహదారి పక్కన శ్రీ వెంకటేశ్వర రైతు సేవా కేంద్రం, హోండా ద్విచక్ర వాహన షోరూం పక్కపక్కనే రెండు భవనాల్లో ఉన్నాయి. రోజూ మాదిరిగానే గురువారం రాత్రి తాళాలు వేసి వెళ్లారు. అర్ధరాత్రి సమయంలో ఎరువుల దుకాణ భవన సైడ్ షట్టర్ తాళాలు పగలగొట్టిన దుండగులు లోపలికి ప్రవేశించి సీసీ టీవీ ఫుటేజ్‌లను ధ్వంసం చేశారు. ఎరువుల దుకాణంలో క్యాష్ కౌంటర్‌లో ఉన్న రూ.2.30 లక్షలు ఎత్తుకెళ్లారు. హోండా షోరూం వెనుక షట్టర్‌ను పగలగొట్టి లోపలికి ప్రవేశించిన దుండగులు సర్వీసు రూమ్‌లో రూ.33 వేలు, షోరూంలోని క్యాష్ కౌంటర్‌లో రూ.50 వేలు మొత్తం రూ.87,300 అపహరించుకుపోయారు. రెండు దుకాణాల వ్యాపారులు శివాపురపు రామారావు, రహిమాన్ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పట్టణ సీఐ బి.బ్రహ్మయ్య నేతృత్వంలో పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్ బృందం వేలిముద్రలు సేకరించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయ వార్షికోత్సవాలు ఆరంభం

- తొలిరోజు వైభవంగా స్వామివార్ల కల్యాణం, గ్రామోత్సవం
- నేడు భారీ అన్నదాన కార్యక్రమం



లక్ష్మీగణపతి హోమంలో పాల్గొన్న భక్తులు

నాదెండ్ల: గణపవరం–కావూరు డొంక రోడ్డులో కొలువైయున్న వీరాంజనేయస్వామి ఆలయ మూడో వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయ ప్రధాన అర్చకులు పరిమి లక్ష్మీనారాయణశాస్త్రి, దర్శి అనిల్‌కుమార్‌శర్మ స్వామివారిని అలంకరించి అభిషేకాలు, అర్చనలు, పూజలు నిర్వహించారు. అనంతరం సువర్చలా సమేత వీరాంజనేయస్వామి కల్యాణం నిర్వహించారు. లక్ష్మీ గణపతి హోమం, సుప్రభాత సేవ, విఘ్నేశ్వర పూజ, కలశస్థాపన, నవగ్రహ మండపారాధన, తమలపాకులతో అర్చన, నూతన వస్త్రాధారణ గావించారు. సాయంత్రం ఉత్సవ మూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు. శనివారం ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఉదయం గోత్రనామ పూజల అనంతరం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. అన్నదాన కార్యక్రమానికి ఏర్పాట్లు చేశారు.

వృద్ధుడి అదృశ్యం



జార్జి

పెదకూరపాడు: మృతి చెందిన వ్యక్తిని చూడటానికి వచ్చి వ్యక్తి అదృశ్యమైన ఘటన మండలం పాటిబండ్లలో చోటు చేసుకుంది. బాధితులు, పోలీసుల కథనం.. బాపట్ల జిల్లా వేమూరు మండలం ఎల్లపాడు గ్రామానికి చెందిన కలిమిల జార్జి(70) ఈనెల 11న వియ్యపురాలు రూతమ్మ అనారోగ్యంతో మృతి చెందగా అంత్యక్రియలకు హాజరయ్యేందుకు వచ్చాడు. కార్యక్రమాలు ముగించుకొని పాడపాడు వద్ద గుంటూరు వెళ్లేందుకు బస్సు ఎక్కాడు. మూడు రోజులు గడిచిన తన ఇంటికి చేరకపోవడంతో కుమార్తె పాటిబండ్ల దీప, అల్లుడు రత్తయ్యకు కుటుంబ సభ్యులు సమాచారం ఇచ్చారు. బంధువులు, స్నేహితులు, చుట్టుపక్క ప్రాంతాల్లో వెతికిన జార్జి ఆచూకీ లభ్యంకాకపోవడంతో కుమార్తె దీప పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్ఐ గిరిబాబు కేసు నమోదు చేశారు. ఆచూకి తెలిస్తే 9440796269, 9581850100 తెలపాలని కోరారు.

ఫార్మర్ రిజస్ట్రేషన్ తప్పనిసరి

నకరికల్లు: రైతులు తమ సమీపంలోని రైతుసేవా కేంద్రాలకు వెళ్లి ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకొని 11 అంకెల విశిష్ట సంఖ్యను పొందాలని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు సూచించారు. మండలంలోని దేచవరం గ్రామంలోని రైతులకు శుక్రవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో వీఆర్వో రాజకుమారి, ఎంపీఈఓ కె.రవిబాబు పాల్గొన్నారు.

అమరావతి మండలంలో..

అమరావతి: పొలం ఉన్న ప్రతి రైతు రైతు సేవా కేంద్రాలలో రైతు పేరు నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖాధికారి అహ్మద్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ధరణికోట రైతుసేవాకేంద్రంలో రైతు నమోదు ప్రారంభించారు.

ఎమ్మెల్సీ లక్ష్మణరావుకు మద్దతుగా ప్రచారం

అమరావతి: ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మద్దతుగా అమరావతి ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కే శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ 2007 నుంచి శాసనమండలి సభ్యుడుగా ఉంటూ ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు. లక్ష్మణరావుకు ఉద్యోగ, ఉపాధ్యాయ, నిరుద్యోగులు, ప్రైవేటు ఉద్యోగుల గెలుపు గా భావించి మొదట ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.మోహన్ రావు, జిల్లా ఉపాధ్యక్షులు బి.నరసింహారెడ్డి, సీఐటీయూ ప్రతినిధులు జి.రవిబాబు, బి.సూరిబాబు, ఎస్‌డీ బహుదీన్ వలి పాల్గొన్నారు.

కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ డొమెస్టిక్ వాయిస్ కోర్సుపై శిక్షణ

క్రోసూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ నిర్మూలన కోసం డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్స్ డెవలప్మెంట్ అండ్ ట్రెనింగ్ అధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి ఆధ్వర్యంలో క్రోసూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ డొమెస్టిక్ వాయిస్ కోర్సుకు ఉచిత శిక్షణనిచ్చి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాధికారి తమ్మాజీరావు శుక్రవారం తెలిపారు. ఈనెల 21 వరకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల క్రోసూరులో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. వివరాలకు కోఆర్డినేటర్ బాపతు అంజి రెడ్డి 7779858789ను సంప్రదించాలని కోరారు.

ముస్లింల జాగరణ ప్రార్థనలు

నకరికల్లు: మండలంలోని ముస్లింలు జాగరణ ప్రార్థనలు నిర్వహించారు. గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం నమాజు వరకు మసీదుల్లో మేల్కొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మత పెద్దలు మాట్లాడుతూ రమాజాన్ మాసం ప్రారంభానికి ముందు వచ్చే జాగరణ రాత్రి రోజు అల్లాహ్ ప్రసన్నం కోసం ప్రత్యేకమైన రోజుగా భావిస్తామని తెలిపారు. జాగరణ కార్యక్రమం పూర్తయిన అనంతరం ప్రపంచ శాంతి కోసం ప్రత్యేక దువా పఠించారు.

షబ్బేబరాత్ నమాజులు

క్రోసూరు: మండలంలోని అన్ని మసీదుల్లో గురువారం రాత్రి షబ్బేబరాత్ ప్రత్యేక నమాజులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు ఉపవాసాలు ఆచరించి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

కోళ్ల ఫారాల నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలి

రాజుపాలెం: కోళ్లఫారాల యజమాని ప్రతిరోజు కోళ్ల ఆరోగ్య పరిస్థితులను పరిశీలించినట్లెతై బర్డ్‌ఫ్లూ వ్యాధిని గుర్తించవచ్చని, తద్వారా వ్యాప్తిని అరికట్టవచ్చని పల్నాడు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కె.కాంతారావు పేర్కొన్నారు. మండలంలోని పలు కోళ్ల ఫారాలలోని కోళ్లను శుక్రవారం పరిశీలించారు. ప్రస్తుతం గోదావరి, కృష్ణా జిల్లాలలోని కోళ్ల ఫారాలలో కోళ్లకు బర్డ్‌ఫ్లూ వ్యాధి వ్యాప్తి చెందిన దృష్ట్యా కోళ్లను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. కమర్షియల్ కోళ్ల ఫారం ఉన్న రైతులను కలసి కోళ్ల ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. కోళ్ల ఫారాల నిర్వాహకులకు బర్డ్‌ఫ్లూ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఆయన వెంట రాజుపాలెం పశువైద్యాధికారి జి.వీరయ్య, మొక్కపాడు పశువైద్యాధికారి కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి

నాదెండ్ల: చందవరం గ్రామానికి చెందిన మైనర్ బాలిక గుండబొమ్మ రేణుశ్రీ (17) ఇంట్లో వంట చేస్తుండగా అగ్నిప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై జి. పుల్లారావు వివరణ ఇచ్చారు. రేణుశ్రీ సాతులూరులోని ఓ ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుకుంటోంది. ఈ నెల 5న సాయంత్రం సమయంలో ఇంట్లో వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు దుస్తులకు మంటలు అంటుకు న్నాయి. దీంతో గాయాలపాలైన బాలికను కుటుంబ సభ్యులు నరసరావుపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ నెల 12న మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. 13న చికిత్స పొందుతూ మృతిచెందింది. తండ్రి రాజారమేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.